సాక్షి
విశాఖపట్నం
మంగళవారం, 12, ఆగస్టు, 2025


నాణ్యత కల్ల ఆరోగ్యం గుల్ల 8లో


వారియర్స్‌పై రాయల్స్ విజయం 8లో


గోవుల్ని తరలిస్తున్న లారీ ఢీకొని వ్యక్తి మృతి 8లో

న్యూస్‌రీల్

స్వాతంత్య్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు


ఏర్పాట్లు సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : జిల్లాలో స్వాతంత్య్ర వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హారేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సమీక్షించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేలా వేడుకలు నిర్వహించాలని, సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలని చెప్పారు. పోలీస్ మైదానంలో నిర్వహించే వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబీకులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన నిర్వహించాలని, స్టాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివిధ పథకాల కింద లబ్ధిపొందిన ప్రజలకు నగదు పంపిణీకి సంబంధించి చర్యలు తీసుకోవాలని, జాబితా రూపొందించాలని సూచించారు. సమావేశంలో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు హర్ ఘర్ తిరంగా యాత్ర

మహారాణిపేట: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్‌లో మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ తెలిపారు. దీనిలో భాగంగా జాతీయ పతాకం ప్రాముఖ్యతను తెలిపే కార్యక్రమాలను చేపట్టనున్నట్టు వెల్లడించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు తిరంగా యాత్ర సాగుతుందని, దీనిలో భాగంగా బైక్ ర్యాలీ ఉంటుందని చెప్పారు. థింసా, కోలాటం, భరతనాట్యం వంటి కళారూపాల ప్రదర్శనతో యాత్ర జరుగుతుందన్నారు. యాత్రలో ప్రజలు, యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

ఈట్ రైట్ క్యాంపస్ ప్రారంభం



దాబాగార్డెన్స్: నగర ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ ఈట్‌రైట్ క్యాంపస్ ప్రారంభించి, వాటి అమలుకు 16 ప్రత్యేక ఎస్‌హెచ్‌ఈ టీమ్స్(శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్) ఏర్పాటు చేయడం జరిగిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. నగరంలో హోటల్స్, రెస్టారెంట్లు, బేకరీలు, వీధి ఆహార విక్రయ కేంద్రాల్లో ఆహార నాణ్యత, పరిశుభ్రత పాటించకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, పలు ఆహార పదార్థాల్లో హానికర రసాయనాలు వినియోగించడం వల్ల కేన్సర్, గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని పూర్తిగా అరికట్టేందుకు ప్రతి జోన్‌కు రెండు 'క్లీ' టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ టీమ్‌లో సహాయ వైద్యాధికారి, శానిటేషన్ సూపర్‌వైజర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ శానిటరీ కార్యదర్శితో పాటు సచివాలయం మహిళా పోలీస్ ఒక బృందంగా ఉంటారని తెలిపారు. వీరు ప్రతిరోజూ కనీసం రెండు లేదా మూడు ఆహారం విక్రయించే కేంద్రాల్లో తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ప్రస్తుతం జోన్‌కు 2 టీమ్‌లు ఉన్నాయని, అవసరమైతే 32 టీమ్‌లు ఏర్పాటు చేసి జోన్‌కు 4 చొప్పున కేటాయిస్తామన్నారు.

త్వరలో కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి


కైలాసగిరిపై పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ ఛైర్మన్, కమిషనర్

ఆరిలోవ: కైలాసగిరిపై నిర్మాణంలో ఉన్న గ్లాస్ బ్రిడ్జి త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. సోమవారం వారు ఇక్కడ నిర్మాణంలో ఉన్న గ్లాస్ బ్రిడ్జిని పరిశీలించారు. పనులు ఎంతవరకు జరిగాయో ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆసియాలోనే పొడవైన ఈ గ్లాస్ బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కైలాసగిరిపై ఏర్పాటు చేయనున్న త్రిశూల్ ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ ప్రధాన ఇంజనీరు వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీశంకర్, మధుసూదనరావు, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మిట్టల్‌పై మోహం ప్రైవేటు దాహం

విశాఖ ఉక్కును ఉద్ధరిస్తామంటూనే.. ప్రైవేటు జపం చేస్తున్న కూటమి సర్కారు



- రాయితీల కోసం దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని బెదిరిస్తున్న మిట్టల్ స్టీల్స్
- రాయితీలు ఇవ్వకపోతే ప్లాంట్ మూసివేస్తామంటూ హెచ్చరికలు
- ఇక్కడా అదే తరహా బెదిరింపులుంటాయని విమర్శలు
- ఇప్పటికే మిట్టల్ ప్లాంట్‌కు రూ.28 వేల కోట్ల ప్రోత్సాహకాలిచ్చిన కూటమి సర్కార్
- స్టీల్‌ప్లాంట్‌కు తక్షణమే రూ.30 వేల కోట్ల సాయం కోరుతున్న ప్రజాసంఘాలు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిశ్రమను ఉద్ధరిస్తామంటూ ఊదరగొడుతున్న చంద్రబాబు సర్కారు.. ఆ సంస్థను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రానికి పరోక్షంగా సహకరిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసి తీరుతామని కేంద్ర ప్రభుత్వం తెగేసి చెబుతుండగా.. మరోవైపు ప్లాంట్‌కు కొద్ది దూరంలోనే మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను నిలబెట్టేందుకు రూపాయి కూడా విదల్చని చంద్రబాబు.. మిట్టల్ స్టీల్స్‌పై వ్యామోహంతో ఏకంగా రూ.28 వేల కోట్ల ప్రోత్సాహకాలు అందించడం విస్మయానికి గురి చేస్తోంది. మొదట్లో కొద్దోగొప్పో రాయితీలు అడిగి ఆ తర్వాత ప్రభుత్వం నెత్తినెక్కి కూర్చుంటుంది మిట్టల్ సంస్థ. దక్షిణాఫ్రికాలో ప్లాంట్ ఏర్పాటు చేసి ఇప్పుడు గొంతెమ్మ కోర్కెలు మిట్టల్ సంస్థ కోరుతోంది. భవిష్యత్తులో ఏపీ పరిస్థితి కూడా ఇలా మారకముందే మేల్కొనాలని ప్రజాసంఘాలు సూచిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్‌కు పునరుజ్జీవనంపై దృష్టి సారించకుండా మిట్టల్‌కు మోకరిల్లడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

నాడు ప్రగల్భాలు పలికి..

ఎన్నికల ముందువరకూ ఉక్కు ఉద్యమం సడలనివ్వనంటూ ప్రగల్భాలు పలికిన టీడీపీ, జనసేన నేతలు కూటమి పేరుతో గద్దెనెక్కిన తర్వాత విశాఖ ఉక్కును ముక్కలు చేసేందుకు ఏం చెయ్యాలో అన్నీ చేస్తోంది. ఓ వైపు కేంద్ర గనుల ఉక్కు మంత్రిత్వ శాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేసి తీరతామని మరోసారి కుండబద్దలుగొట్టింది. అయినా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం ప్లాంట్ మూసివేసేందుకు పూర్తిగా సహకారం అందిస్తోంది. ఇందులో భాగంగానే విశాఖ ఉక్కుకు కొద్ది దూరంలో అనకాపల్లి జిల్లాలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తోంది. ప్రజలు, ఉద్యోగుల ఆందోళనలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నిరసనలను ప్రభుత్వం ఏమాత్రం ఖాతరు చేయకుండా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అండ్ కో మిట్టల్‌కు మోకరిల్లుతున్నారు. స్టేజ్–1లో మిట్టల్ పరిశ్రమ ఏర్పాటుకు ఏకంగా రూ.28 వేల కోట్ల ప్రోత్సాహకాలు అందించిన చంద్రబాబు ప్రభుత్వం.. ఆ సంస్థకు కావల్సిన సమస్త సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మిట్టల్ బెదిరింపులు మామూలుగా ఉండవు

మిట్టల్ సంస్థ ప్లాంట్ ఏర్పాటు చేశాక ప్రభుత్వాన్నే బెదిరించే స్థాయికి చేరుకుంటుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే.. దక్షిణాఫ్రికాలో ఇదే మిట్టల్ సంస్థ అక్కడి ప్రభుత్వాన్ని బెదిరిస్తోంది. ఇప్పుడిస్తున్న రాయితీలు సరిపోవడం లేదనీ.. తాము కోరినంత రాయితీ, ప్రోత్సాహకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. లేదంటే ప్లాంట్ మూసేస్తామంటూ హెచ్చరిస్తోంది. దీంతో భయాందోళనలకు గురైన దక్షిణాఫ్రికా ప్రభుత్వం తప్పని పరిస్థితుల్లో 92 మిలియన్ డాలర్ల భారీ రాయితీలు కల్పించేందుకు అంగీకారం తెలిపింది. మిట్టల్‌ని పెంచి పోషిస్తే భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వంపైనా ఇలాంటి బెదిరింపులు తప్పవని ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కాగా.. కూటమి ఎంపీల తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడేందుకు ఒక్కసారి కూడా కూటమి ఎంపీలు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వద్దకు వెళ్లలేదు. కానీ.. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు సకల సదుపాయాలు కల్పించాలని కోరేందుకు మాత్రం పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, విశాఖ ఎంపీ భరత్ నేతృత్వంలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి వద్ద సాగిలపడ్డారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని ఏ ఒక్కరోజూ కోరని కూటమి ఎంపీలు మిట్టల్ ప్లాంట్‌కు మాత్రం సొంత ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని మోకరిల్లుతున్నారు. విశాఖ ఉక్కుపై కూటమి ఎంపీలు, ప్రభుత్వ తీరుచూసి విశాఖ ఉక్కు పరిరక్షణ సంఘాలు ఆగ్రహంతో రగిలిపోతున్నాయి.

మిట్టల్‌పై ఎందుకంత మోజు?



మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం ఇప్పటికే వేల ఎకరాల భూముల్ని ధారాదత్తం చేసి.. ప్రజల జీవనోపాధి, జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. దశాబ్దాల చరిత్ర గల విశాఖ ఉక్కుని పరిరక్షించాలన్న ధ్యాస రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. సొంత గనులు కేటాయించాలని పదేపదే కోరినా పట్టించుకోని ఎంపీలు.. ఇప్పుడు మిట్టల్‌కు సొంత గనులు కేటాయించాలని కోరడం దుర్మార్గం. ప్రభుత్వ తీరు చూస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని పూర్తిగా బలహీనపరచడమే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. మిట్టల్ సంస్థపై చంద్రబాబు ప్రభుత్వం ఎందుకంత మోజు చూపిస్తోందో అర్థం కావడం లేదు. ఎంపీలు ప్రైవేటుకు ఊడిగం చేయడం హేయమైన చర్య. ఇప్పటికైనా కళ్లు తెరిచి స్టీల్‌ప్లాంట్‌కు రూ.30 వేల కోట్ల ఆర్థిక సాయం తీసుకొచ్చి ఆంధ్రుల హక్కుని బతికించాలి.

– ఈఏఎస్ శర్మ, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి

• త్రివర్ణ పతాక రెపరెపలు



స్వాతంత్య్ర దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో త్రివర్ణ పతాకం వాడవాడలా రెపరెపలాడుతోంది. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమానికి మద్దతుగా తూర్పు నౌకాదళం ప్రత్యేక కార్యక్రమాలు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా సోమవారం సీ కేడెట్ కార్ప్స్(ఎస్‌సీసీ) ఆధ్వర్యంలో నౌసేనా బాగ్‌లో తిరంగ ర్యాలీ నిర్వహించారు. నౌసన్ బాగ్‌లోని నేవల్ క్వార్టర్స్, అధికారుల నివాస సముదాయాలు, నేవీ కార్యాలయాల వీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి దేశభక్తిని చాటుకున్నారు. – విశాఖ సిటీ

జోన్–2 జెడ్సీ సస్పెన్షన్ పొడిగింపు

అల్లిపురం: అక్రమాస్తుల ఆరోపణలపై గత ఏడాది అరెస్ట్ అయిన జీవీఎంసీ జోన్–2 జోనల్ కమిషనర్ పొండూరు సింహాచలం సస్పెన్షన్‌ను ప్రభుత్వం పొడిగించింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (విజిలెన్స్–1) విభాగం ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది నవంబర్ 26న ఏసీబీ అధికారులు సింహాచలాన్ని అరెస్ట్ చేసి, ఆ తర్వాత విధుల నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా మళ్లీ సమీక్షించి సస్పెన్షన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. సింహాచలంపై వచ్చిన ఆరోపణలపై విచారణ కొనసాగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఎస్సీ విభాగం సమావేశాన్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కే.కే.రాజు, పరిశీలకుడు కదిరి బాబూరావు

మహారాణిపేట : మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన జరగనున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పిలుపునిచ్చారు. సోమవారం మద్దిలపాలెంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబురావుతో కలిసి ఎస్సీ సెల్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి కేబినెట్, నామినేటెడ్ పదవుల్లో దళితులకు సముచిత స్థానం కల్పించారన్నారు. ఎస్సీ సెల్ విభాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం నాయకులు పూర్ణచంద్రరావు, ఐడిబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ రెయ్యి వెంకటరమణ, కార్పొరేటర్ శశికళ, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరీ, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బంగారు భవాని శంకర్, ఇతర నాయకులు లక్ష్మణ్ రావు, ఆకుల శ్యామ్, పూడి మల్లేశ్వరరావు, పరదేశి, జిల్లా ఎస్సీ విభాగం నాయకులు చలం, మురళి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల వారీగా పీ–4 మ్యాపింగ్ ప్రక్రియ

మహారాణిపేట : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సచివాలయాల వారీగా పీ–4 మార్గదర్శుల మ్యాపింగ్ ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. నగర పరిధిలోని అన్ని సచివాలయాల్లో 10 మంది మార్గదర్శులను గుర్తించి బంగారు కుటుంబాలకు అనుసంధానం చేయాలని సూచించారు. ఆసక్తి కలిగిన పారిశ్రామికవేత్తలు, ఇతర వ్యాపారాల నిర్వాహకులు మండలాలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే దీవీస్ అధికారులు మండలాన్ని దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. గాజువాక, పెదగంట్యాడ, గోపాలపట్నం, ములగాడ మండలాలను ఆయా ప్రాంతాల పరిధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలు దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమాల్లో జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు పట్టని పీ4!

- బంగారు కుటుంబాల దత్తతకు ముందుకు రాని వైనం
- మార్గదర్శకుల ఎంపిక తుది గడువు ఈ నెల 19
- ప్రభుత్వ తీరుతో తలలు పట్టుకుంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలనలో భాగంగా అమలుకు ప్రతిపాదించిన పబ్లిక్(ప్రభుత్వ), ప్రైవేట్, పీపుల్(ప్రజల) పార్టనర్‌షిప్(పీ4) కార్యక్రమం నత్తనడకగా సాగుతోంది. మార్గదర్శకుల ఎంపికలో ఎమ్మెల్యేలు, ఎంపీలు కనీస ఆసక్తి చూపట్లేదు. విశాఖ జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రధాన ప్రజాప్రతినిధులు చాలా వరకు స్థితిమంతులే. రూ.కోట్ల ఆస్తులకు పడగలెత్తిన వీరు బంగారు కుటుంబాల దత్తతకు ఎందుకనో చొరవ చూపట్లేదు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమావేశాలు నిర్వహించి మరీ పీ4 అమలుపై చర్చించారు. అయినా ఒక అడుగు ముందుకు పది అడుగులు వెనక్కి అన్నట్టుగానే కార్యక్రమ అమలు తీరు కనిపిస్తోంది.

సమీక్షలతోనే సరి..! : జిల్లాలో 73,452 బంగారు కుటుంబాలను గుర్తించారు. వీరిని దత్తత తీసుకుని ఆర్థికంగా చేయూతనివ్వాలన్న లక్ష్యంతో కూటమి సర్కార్ నడుస్తోంది. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్ పీ4 అమలు కోసం సమీక్షల మీద సమీక్షలు నిర్వహించి మరీ అధికారులకు సూచనలిస్తున్నారు. దీంతో అధికార యంత్రాంగం మల్లగుల్లాలు పడుతోంది. ఈ నెల 19 నాటికి అవసరమైన మార్గదర్శకులను ఎంపిక చేయాలని అధికారులకు లక్ష్య నిర్దేశం చేశారు. దాతలను వెతికి పట్టుకోవడానికి జిల్లా యంత్రాంగం జిల్లా, మండల అధికారులకు సమావేశాలు నిర్వహించి పలు సూచనలు చేస్తోంది. అయితే ఇవేవీ అనుకున్నంత గొప్పగా సాగట్లేదన్నది నిర్వివాదాంశం.

ప్రజా ప్రతినిధుల్లో నిర్లిప్తత

పీ4 ద్వారా అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవాలన్న సీఎం పిలుపుపై ప్రజాప్రతినిధుల్లో పెద్దగా ఆసక్తి కనిపించట్లేదు. జిల్లాలో స్థితిమంతులైన ఎమ్మెల్యేలు, ఎంపీలు నియోజకవర్గంలో బాగా వెనుకబడిన గ్రామాన్ని, లేదా కొన్ని కుటుంబాలనైనా దత్తత తీసుకోవచ్చు. కనీసం వీరు చెప్తే ముందుకొచ్చే వాళ్లు ఆయా నియోజకవర్గాల్లో పదులు, వందల సంఖ్యలో ఉంటారు. ఎందుకనో ఒకరిద్దరు మినహా ఎవరూ దీనిపై స్పందించట్లేదు. ఆర్థిక, సామాజిక స్థితిగతుల ఆధారంగా పరిశీలిస్తే ఇలాంటి సేవా కార్యక్రమాల్లో రాష్ట్రంలో విశాఖ జిల్లా ముందంజలో ఉండాలి. ఇక్కడి పాలకుల్లో స్పందన కరువవడంతో అధికారుల రెక్కల కష్టంపైనే పీ4 అమలు ఆధారపడి ఉంది.

సంస్థల అనాసక్తి : జిల్లా పరిధిలోని పారిశ్రామిక సంస్థలు, యాజమాన్యాలు ఇప్పటికే సీఎస్సార్ నిధులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అవి కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకే నిధులు కేటాయిస్తున్నాయి. సంపన్నులు కూడా తమ పరిధిలో చేతనైనంత సాయం చేస్తున్నారు. మళ్లీ కొత్తగా పీ4లో భాగస్వామ్యంతో పనేంటని వీరు పెదవి విరుస్తున్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలు నూరు శాతం అమలు చేస్తే ఇలాంటి పథకాల అవసరమే ఉండదని చెప్తున్నారు. మరోవైపు పేదల్ని పెద్దల చెప్పుచేతల్లో పెట్టడమే ఈ పథకం ఉద్దేశమని పలువురు ఆక్షేపిస్తున్నారు.

వారం రోజులే గడువు

నాలుగంచెల ప్రక్రియ ద్వారా జిల్లాలో 73,452 బంగారు కుటుంబాలను గుర్తించారు. వీరిలో కూడా కొందరు అనర్హులున్నారన్న ప్రచారం జరుగుతోంది. అయితే ఈ బంగారు కుటుంబాలను ఆదుకునే మార్గదర్శకుల ఎంపిక మాత్రం ఇంకా పూర్తి కాలేదు. సంపన్నులు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, ప్రవాసాంధ్రుల్లో కనీసం 12 వేల మందిని గుర్తించాల్సి ఉంది. ఈ నెల 19 నాటికి వీరి ఎంపిక పూర్తి కావాలి. ఇప్పటి వరకు ఎంత మంది ముందుకొచ్చారో కూడా తెలియని పరిస్థితి.

దూసుకొచ్చిన మృత్యువు

- ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఢీకొని మహిళ మృతి
- మరొకరికి గాయాలు


ప్రమాదానికి కారణమైన బస్సు

దాబాగార్డెన్స్: ఆ కుటుంబం ఆదివారం ఎంతో సంతోషంగా గడిపింది. మనుమడి అన్నప్రాశన వేడుకను సంబరంగా జరుపుకుంది. మరుసటి రోజు ఎంతో ఆనందంతో తిరిగి ఇంటికి ప్రయాణమైన ఆమెను ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ విషాద ఘటన సోమవారం సాయంత్రం ద్వారకా బస్టాండ్‌లో చోటుచేసుకుంది. విజయనగరం జిల్లా శృంగవరపుకోట, పోతనాపల్లి గ్రామానికి చెందిన గేదెల ముత్యాలమ్మ (47), తన పెద్ద కుమార్తె కుమారుడి అన్నప్రాశన కోసం గాజువాకలో ఉన్న ఇంటికి వచ్చింది. ఆదివారం కుటుంబ సభ్యులందరూ కలిసి వేడుకను ఆనందంగా జరుపుకున్నారు. సోమవారం తిరుగు ప్రయాణమై, ద్వారకా బస్టాండ్‌కు చేరుకుంది. సాయంత్రం 4.50 గంటల ప్రాంతంలో తన చిన్న కుమార్తెను బొబ్బిలి బస్సు ఎక్కించి, తాను ఎస్.కోట వెళ్లే బస్సు కోసం ప్లాట్‌ఫాం నంబర్ 25 వద్ద వేచి ఉంది. సరిగ్గా అదే సమయంలో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్లే పల్లె వెలుగు బస్సు అతి వేగంగా ప్లాట్‌ఫాంపైకి దూసుకువచ్చింది. ఆ బస్సు ఢీకొనడంతో ముత్యాలమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. నిండు నూరేళ్లు జీవించాల్సిన ఆ తల్లి, మనుమడిని చూసుకున్న సంతోషం మనసులో మెదులుతుండగానే, విధి ఆడిన వింత నాటకానికి బలైపోయింది. ముత్యాలమ్మ మృతితో ఆమె కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ముత్యాలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం

బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాంపైకి బస్సు తీసుకొచ్చేటప్పుడు గంటకు 5 కిలోమీటర్ల వేగం మించకూడదని నిబంధనలు చెబుతున్నాయి. అయితే, వేగంగా వచ్చిన బస్సు ప్రమాదానికి కారణమైందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు 'సాక్షి'కి తెలిపారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ తర్వాత ఈ విషయం స్పష్టమైంది. దీనిపై డ్రైవర్ చంద్రరావును ప్రశ్నించగా, బ్రేకులు ఫెయిల్ అయ్యాయని చెప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో బస్టాండ్‌లో భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొదలైంది.


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువు (ఇన్‌సెట్) ముత్యాలమ్మ(ఫైల్)

బస్సు స్పీడ్‌గా వచ్చేసింది..



నేను అరకు వెళ్లాలి. బస్సు కోసం ఎస్.కోట ప్లాట్‌ఫాం వద్ద సమీపాన కూర్చున్నా... పదడుగుల దూరంలో ఆ మహిళ బ్యాగ్ పట్టుకుని నిల్చున్నారు. ఇంతలో ఆర్టీసీ బస్సు స్పీడ్‌గా ఆమెను ఢీకొని లోపలికి వచ్చేసింది. చూస్తుండగానే ఆ మహిళ బస్సుకు అక్కడున్న స్తంభానికి మధ్యలో నలిగిపోయింది. ఇంకో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.

– కమిడి గురు, అరకు, ప్రత్యక్ష సాక్షి

రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఏదీ?

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి

మహారాణిపేట: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, ఓ పక్క మహిళలు భయాందోళనలో ఉంటే మరో పక్క మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆందోళన వ్యక్తం చేశారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎక్కడ చూసినా బెల్టు షాపులు దర్శనం ఇస్తున్నాయని, వీటి వల్ల మహిళలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డబ్బులు తీసుకొని మద్యం షాపుల దగ్గర పర్మిట్ రూమ్‌లు పెడుతున్నారని, మద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరుగా మార్చుకుందని ఆక్షేపించారు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా బస్ ఫ్రీ అన్నారని, ప్రీమియం బస్సుల్లో మాత్రం మహిళలకు ఫ్రీ లేదని తెలిపారు. ఉచిత బస్సులు కేవలం 30 కిమీ దూరం మాత్రమే తిరుగుతాయని, తిరుపతి వెళ్లాలంటే మహిళలు ఎలా వెళ్లాలని, కండిషన్స్ అప్లై అనేలా ఫ్రీ బస్ పథకం కనపడుతోందని ఆక్షేపించారు. పథకాల కోసం వైఎస్సార్‌సీపీ నిలదీయడం వల్లే హామీలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గరుడ, అమరావతి, ఇంద్ర, సూపర్ లక్జరీ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు చెప్పిందొకటి.. ఇప్పుడు మాట్లాడుతుంది ఇంకొకటి అని అన్నారు. మహిళలను ఇంతలా మోసం చేస్తారా..? అని ప్రశ్నించారు. సమావేశంలో కార్పొరేటర్లు శశికళ, పద్మారెడ్డి, పార్టీ మహిళా నేతలు శ్రీదేవివర్మ, కల్పన, జ్యోతి, పార్వతి, ధనలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

'సృష్టి' విచారణ వేగవంతం

ఆస్పత్రిలో హైదరాబాద్ పోలీసుల తనిఖీలు

మహారాణిపేట: సృష్టి కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్ పోలీసులు సోమవారం వాల్తేరు అప్‌ల్యాండ్‌లో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. ఈ ఆస్పత్రిలో కేజీహెచ్‌కు చెందిన ఓ సీనియర్ గైనిక్ వైద్యాధికారి సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. సృష్టి కేసులో ఈ ఆస్పత్రి యాజమాన్యం, ఇతర వైద్యులు, కేజీహెచ్ వైద్యులను పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. పోలీసులు కీలకమైన డాక్యుమెంట్లు, సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఇప్పటికే హైదరాబాద్ పోలీసుల అదుపులో ఉన్న ఒక గైనిక్ వైద్యుడితో ఆర్థిక లావాదేవీలు జరిపిన వారి వివరాలపై కూడా ఆరా తీశారు.

ఎల్‌జీ పాలిమర్స్ ఘటనలో ప్రాసిక్యూషన్ ఉపసంహరణ

బీచ్‌రోడ్డు : 2020లో జరిగిన ఎల్‌జీ పాలిమర్స్ గ్యాస్ లీక్ ఘటనలో పలువురిపై నమోదైన కేసులపై ప్రభుత్వం ప్రాసిక్యూషన్ ఉపసంహరించుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులను జారీ చేశారు. సంఘటన రోజున మృతదేహాలతో నిరసన తెలిపి.. పోలీసులపై దాడులు చేసిన 32 మందిపై కేసు నమోదు చేశారు. ఆ కేసులపైన ప్రాసిక్యూషన్ ఉపసంహరిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

నేడు డీవార్మింగ్ డే

మహారాణిపేట: చిన్నారుల ఆరోగ్యానికి హానికరమైన నులిపురుగుల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జరగనున్న 'డీవార్మింగ్ డే' సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో భోజనం తర్వాత ఈ మాత్రలు వేయించాలని చెప్పారు.

విస్తృతంగా జీవీఎంసీ 'ఆపరేషన్ లంగ్స్'

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, పార్కులు, రిజర్వ్ ప్రదేశాలు, ఇతర ప్రజా ఆస్తులను పరిరక్షించడం చాలా ముఖ్యమని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ ఆస్తులపై హక్కులు పూర్తిగా ప్రభుత్వం, జీవీఎంసీకే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ మేరకు నగరంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం జీవీఎంసీ 'ఆపరేషన్ లంగ్స్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని విస్తృతం చేసిందని, ఈ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నాణ్యత కల్ల ఆరోగ్యం గుల్ల

బయట ఫుడ్ తింటే అంతే..


ఓ హోటల్‌లో పాడైన ఆహారం

- నగరంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్స్‌లో పరిస్థితి దారుణం
- ఒక్క రోజు తనిఖీల్లో 175 కేజీల నిల్వ ఆహారం గుర్తింపు
- 85 శాతం హోటల్స్‌లో కల్తీ ఆహారం విక్రయం
- ఆహార భద్రత, ప్రమాణాల శాఖ దాడుల్లో గుర్తింపు

బీచ్‌రోడ్డు : నేటి ఆధునిక ప్రపంచంలో యువత ఆహార అలవాట్లు శరవేగంగా మారుతున్నాయి. ఉరుకుల పరుగుల జీవితంలో, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయాల్సి రావడంతో ఇంట్లో వంటకు సమయం దొరకడం లేదు. దీంతో చాలామంది బయటి ఆహారంపై, ముఖ్యంగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలపై ఆధారపడుతున్నారు. అయితే, ఈ అలవాటు ఆరోగ్యానికి ఎంతవరకు సురక్షితం అన్న ప్రశ్న ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. తాజాగా నగరంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైన అంశాలు ఈ ఆందోళనలకు బలం చేకూర్చుతున్నాయి. పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులతో సహా తనిఖీ చేసిన 85శాతం చోట్ల కల్తీ, నాసిరకమైన, అపరిశుభ్రమైన ఆహారాన్ని విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రోజుల తరబడి నిల్వ ఉంచిన పదార్థాలు, గడువు తీరిన ఆహార ఉత్పత్తులు, హానికరమైన రంగులు, రసాయనాలు ఉపయోగిస్తున్నట్లు బయటపడింది.


తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం

ఈ రకమైన ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు, ఫుడ్ పాయిజనింగ్, దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆధునిక జీవనశైలి సౌకర్యాలను అందిస్తున్నప్పటికీ, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఈ తనిఖీలు మరోసారి రుజువు చేశాయి. ప్రజలు తమ ఆహారపు అలవాట్లపై శ్రద్ధ వహించాలని, బయటి ఆహారాన్ని తగ్గించి, ఇంట్లో తయారుచేసుకున్న పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

బేకరీల్లోనూ అదే పరిస్థితి

బేకరీలలోనూ ఇదే పరిస్థితి. చాలా దుకాణాల్లో గడువు ముగిసిన పదార్థాలు, హానికరమైన రసాయనాలు, రంగులు వాడుతున్నట్లు గుర్తించారు. కొన్నిచోట్ల రెండు, మూడేళ్ల క్రితం గడువు తీరిన వస్తువులను కూడా విక్రయిస్తున్నట్లు తేలింది. రామ్ నగర్‌లోని బేకరీ డెన్, తగరపువలసలోని దేవీ స్వీట్స్, ఎస్ఎస్ఎన్ బేకరీలలో గడువు తీరిన ఆహారం విక్రయిస్తున్నారు. దయారం స్వీట్స్‌లో ఫంగస్ పట్టిన బాదంపప్పును అధికారులు గుర్తించారు.

హోటళ్లలో కల్తీ ఆహారం

20 బృందాలుగా ఏర్పడిన అధికారులు ఒక రోజు 40 హోటళ్లను తనిఖీ చేయగా, వాటిలో 85 శాతం చోట్ల నాసిరకం ఆహారం, అపరిశుభ్రత వెలుగులోకి వచ్చాయి. రోజుల తరబడి నిల్వ ఉంచిన చికెన్, మటన్, కుళ్లిపోయిన గుడ్లు, దుర్వాసన వస్తున్న నూడుల్స్ వంటి పదార్థాలను వంటలకు ఉపయోగిస్తున్నట్లు కనుగొన్నారు. కేవలం ఒక్క రోజులోనే 125 కేజీల పాడైపోయిన ఆహారాన్ని గుర్తించి పారవేశారు. ముఖ్యంగా ఇసుకతోటలోని మాయ, ముంతాజ్ హోటళ్లు, జగదాంబ జంక్షన్‌లోని ఆల్ఫా హోటళ్లలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు లభించాయి. చికెన్, మటన్ గ్రేవీలు నాలుగు నుంచి ఐదు రోజుల పాటు నిల్వ ఉంచినట్లు అధికారులు గుర్తించారు.

175 కిలోల పాడైన ఆహారం స్వాధీనం

ఈ దాడుల్లో మొత్తం 175 కేజీల పాడైపోయిన ఆహారాన్ని స్వాధీనం చేసుకున్నారు. హోటళ్లు, బేకరీలలో గుర్తించిన 81 రకాల ఆహార పదార్థాల నమూనాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్ పంపారు. 17 హోటళ్లు, 16 స్వీట్, బేకరీ షాపులపై కేసులు నమోదు చేసి, 20 దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. ప్రజలు బయట ఆహారం తీసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సచివాలయ హెల్త్ సెక్రటరీల ధర్నా


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

మహారాణిపేట: తమకు పబ్లిక్ హాలిడేస్ వర్తింపజేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సచివాలయ హెల్త్ సెక్రటరీల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డ్ హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ పిలుపు మేరకు చేపట్టిన ఈ నిరసన కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీలు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ఆందోళనకు అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు పి. మణి, జనరల్ సెక్రటరీ ఎస్. సుభాషిణి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను తరచూ డీఎంహెచ్‌వో దుర్భాషలాడుతున్నారని, అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్‌లో చేపట్టిన బదిలీలను యథాతథంగా కొనసాగించాలని, తక్షణమే గ్రేడ్ 2 ప్రమోషన్లు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అంతేకాకుండా తమకు ఇతర డిపార్ట్‌మెంట్ పనులు అప్పగించవద్దని, పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. తమ సర్వీస్ రికార్డులను భద్రపరచడానికి ఒక అధికారిని కేటాయించాలని, పనివేళలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్చాలని వారు విజ్ఞప్తి చేశారు. తమను పూర్తిగా వైద్య, ఆరోగ్య శాఖలో విలీనం చేయాలని వారు కోరారు.

వారియర్స్‌పై రాయల్స్ విజయం


రాయల్స్ తరపున అర్ధసెంచరీ చేసిన రాహుల్


రాయల్స్‌ను విజయతీరానికి చేర్చిన ప్రసాద్-పాండురంగ

విశాఖ స్పోర్ట్స్ : ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టీ20లో భాగంగా సోమవారం జరిగిన తొలిమ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్‌పై అమరావతి రాయల్స్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వారియర్స్ 6 వికెట్లకు 188 పరుగులు చేసింది. కెప్టెన్ మహీప్ కుమార్(28), ప్రశాంత్(59), ఆనంద్(32), శశికాంత్(36) బ్యాటింగ్‌లో రాణించారు. కార్తీక్, మల్లికార్జున రెండేసి వికెట్లు తీయగా అయ్యప్ప, వినయ్ చెరో వికెట్ తీశారు. రాయల్స్ కెప్టెన్ హనుమవిహారీ(9) తక్కువ స్కోర్‌కే వెనుదిరగ్గా.. రాహుల్(61) సందీప్ (33), ప్రసాద్ (42 నాటౌట్), పాండురంగ(39 నాటౌట్) రాణించారు. శశికాంత్ రెండు వికెట్లు తీయగా స్టీఫెన్, తోషిత్, సౌరబ్ ఒక్కో వికెట్ తీశారు.

కింగ్స్‌ను గెలిపించిన తపస్వి

మరో మ్యాచ్‌లో సింహాద్రి వైజాగ్ లయన్స్‌పై కాకినాడ కింగ్స్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన సింహాద్రి వైజాగ్ లయన్స్ ఏడు వికెట్లకు 207 పరుగులు చేసింది. కెప్టెన్ రికీబుయ్(85), సందీప్(60), అభిషేక్(29) వీరారెడ్డి(22) రాణించారు. ఆంజనేయులు మూడు వికెట్లు, సుదర్శన్, ప్రమోద్ చెరో వికెట్ తీశారు. ప్రతిగా కింగ్స్ ఐదు వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి విజయం సాధించింది. తపస్వి (94), రాహుల్ (43), సూర్య (36), లేఖజ్(22 నాటౌట్) రాణించారు. రంజిత్ రెండు, అజయ్, విజయ్, సాయితేజ ఒకో వికెట్ తీయగలిగారు.

గోవుల్ని అక్రమంగా తరలిస్తున్న లారీ ఢీకొని వ్యక్తి మృతి

- రోడ్డుపై సొమ్మసిల్లి పడిపోయిన మూగజీవాలు


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన ఆవులు, దూడలు

ఆరిలోవ: అక్రమంగా పశువుల్ని తరలిస్తున్న లారీ ఆదివారం అర్ధరాత్రి దాటాక ఓల్డ్ డైరీ ఫారం వద్ద జాతీయ రహదారిపై బోల్తాపడింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోగా, లారీలో ఉన్న ఆవులు, దూడలు గాయపడ్డాయి. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ప్రాంతంలోని సంతలో కొనుగోలు చేసిన 18 ఆవులు, దూడలను ఓ వ్యక్తి లారీలో కిక్కిరిసినట్లు ఎక్కించి విశాఖ వన్‌టౌన్ ప్రాంతానికి ఆదివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్నాడు. హైవేపై విమ్స్ వైపు నుంచి విశాలాక్షినగర్ స్టేట్ బ్యాంక్ వైపు రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని అర్ధరాత్రి ఆ లారీ ఢీకొట్టి బోల్తాపడింది. వ్యక్తి తలకు తీవ్రగాయాలై, రక్తస్రావంతో రోడ్డుపై ప్రాణాలతో కొట్టుమిట్టాడాడు. లారీలో ఆవులు, దూడలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడి సొమ్మసిల్లిపోయాయి. కొన్నింటికి గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న వాహనచోదకులు పోలీసులకు సమాచారమివ్వడంతో ఆరిలోవ పోలీసులు ఘటనాస్థలికి వచ్చి కొనఊపిరితో ఉన్న వ్యక్తిని కేజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రికి తీసుకువెళ్లేసరికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు అక్కడి వైద్యులు చెప్పారు. లారీతో పాటు, పశువుల్ని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా ఓ కేసు, అక్రమంగా గోవుల తరలింపుపై మరో కేసు నమోదు చేసినట్లు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి


వినతులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాస్, కమిషనర్ కేతన్ గార్గ్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు వెల్లువెత్తాయి. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమానికి మొత్తం 113 వినతులు వచ్చాయని తెలిపారు. వీటిలో అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి 67 ఫిర్యాదులు అందగా, మిగిలినవి ఇతర విభాగాలకు వచ్చాయని వివరించారు. జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్‌కు 4 ఫిర్యాదులు, రెవెన్యూ విభాగానికి 8, ప్రజా ఆరోగ్యానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 22, యూసీడీ విభాగానికి 5 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి, సంబంధిత అధికారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు. వచ్చిన అర్జీలపై అధికారులు అదే రోజు స్పందించి కార్యాచరణ చేపట్టాలని అధికారులను, జోనల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ పల్లంరాజు, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌ఏడీలో స్పా సెంటర్‌పై దాడి

గోపాలపట్నం : ఎన్ఏడీ జంక్షన్‌లోని స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్ట్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. స్పా సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఈ దాడి నిర్వహించారు. గతంలో కూడా గోపాలపట్నం ప్రాంతంలో ఇదే సంస్థకు చెందిన బ్రాంచ్‌పై దాడి చేశారు. ఇప్పుడు ఎన్ఏడీ జంక్షన్‌లోని ఆల్ఫా హోటల్ పైన ఉన్న 'ఎలైట్ వెల్‌నెస్ స్పా సెంటర్'పై సోమవారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు యువతులు, ముగ్గురు విటులు, యజమానిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎయిర్‌పోర్టు సీఐ ఉమా మహేశ్వరరావు, ఎస్సైలు రామారావు, రామకృష్ణ, టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఇబ్బంది పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు

బీచ్‌రోడ్డు: పన్ను చెల్లింపుదారులకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆదాయపు పన్ను శాఖ ఏపీ, తెలంగాణ రీజియన్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం నగరానికి వచ్చిన ఆయన విశాఖపట్నం రీజియన్‌లో ఆదాయపు పన్ను శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పన్ను వసూలు లక్ష్యాలు, చెల్లింపు దారులను చేరుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు, పలు సంస్కరణల అమలుపై ప్రధానంగా చర్చించారు.

పోలీసు పీజీఆర్‌ఎస్‌కు 105 ఫిర్యాదులు


సమస్యలు తెలుసుకుంటున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 105 ఫిర్యాదులు వచ్చాయని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. కార్యక్రమంలో సబ్-డివిజన్ ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భూ వివాదాలు, మోసాలు, సివిల్ కేసులకు సంబంధించినవి ఉన్నాయని పేర్కొన్నారు. కమిషనర్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు 313 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు ప్రజల నుంచి 313 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి 130, జీవీఎంసీకి 82, పోలీసు విభాగానికి 15, ఇతర విభాగాలకు 86 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను వెంటనే ఆన్‌లైన్‌లో పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పదే పదే వచ్చే ఫిర్యాదులను లోతుగా విచారించాలని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కాల్ సెంటర్ ఫీడ్‌బ్యాక్‌ను మెరుగుపరచాలని, ఫిర్యాదుదారుడితో సంబంధిత అధికారి తప్పనిసరిగా మాట్లాడాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేసీ కె. మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, , ఏడీసీ వర్మ పాల్గొన్నారు.

డెయిరీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి


దీక్ష శిబిరంలో నిద్రిస్తున్న విశాఖ డెయిరీ కాంట్రాక్టు కార్మికులు, సీఐటీయూ నేతలు

బీచ్‌రోడ్డు: విశాఖ డెయిరీలో తొలగించిన 305 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 24 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడు తూ డైయిరీ కార్మికులు కొన్ని దశాబ్దాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తూ, తమ విధి నిర్వహణలో ఎంతో అనుభవాన్ని సంపాదించారన్నారు. అటువంటి వారికి వేతనాలు పెంచడం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలను కల్పించాల్సిన యాజమాన్యం, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, వారిని తొలగించడం చట్ట విరుద్ధమన్నారు. అంతేకాకుండా అనుభవం ఉన్న కార్మికులను తొలగించి, కొత్తవారిని నియమించుకోవడం మరింత దుర్మార్గమన్నారు. అన్యాయంగా సస్పెండ్ చేసిన నలుగురు పర్మినెంట్ యూనియన్ నాయకులను కూడా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, విశాఖ డెయిరీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం. రాంబాబు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ నాయకురాలు మణి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు, జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కే. సత్యనారాయణ పాల్గొన్నారు.

'తల్లి'కి వందనం 'పాట్లు'

- కలెక్టరేట్‌కు క్యూ కట్టిన తల్లులు
- సచివాలయం, కలెక్టరేట్ చుట్టు ప్రదక్షిణలు


తల్లికి వందనం రాలేదంటూ కలెక్టరేట్‌లో డీఈవో కార్యాలయం సిబ్బందిని చుట్టుముట్టిన మహిళలు

మహారాణిపేట: హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు అర్హుల సంఖ్యను తగ్గించేందుకు కొత్త నిబంధనలను తెరపైకి తేవడంతో తల్లుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 'తల్లికి వందనం' పథకం కోసం తల్లులు పడుతున్న అష్టకష్టాలకు కలెక్టరేట్ వేదికగా సోమవారం మరోసారి సాక్ష్యంగా నిలిచింది. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు క్యూ కట్టిన తల్లులు, తమకు పథకం డబ్బులు ఎందుకు రాలేదో తెలియక తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం ఇస్తాం అని ఎన్నికల ముందు చెప్పిన నాయకులు, ఇప్పుడు 'ఇంట్లో ఒకరికి ఉచిత సీటు వస్తే ఇంకొకరికి కట్' అంటూ సరికొత్త నిబంధనలను తీసుకొచ్చారని తల్లులు మండిపడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచిత సీట్లు పొందినవారికి కూడా 'అమ్మఒడి' ఇచ్చిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం అర్హుల సంఖ్య తగ్గించేందుకే ఇలాంటి నిబంధనలు తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ కొత్త నిబంధనల వల్ల ప్రభుత్వం నుంచి ఏ పథకం వచ్చినా 'తల్లికి వందనం' కట్ అవుతోందన్న విషయం చాలామంది తల్లులకు తెలియక గగ్గోలు పెడుతున్నారు. ఉదాహరణకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీటు లభించినా, విద్యుత్ బిల్లు 300 యూనిట్లు దాటినా ఈ పథకం వర్తించకుండా చేస్తున్నారు. ఇంతేకాకుండా ఉచిత సీటు రానివారికి కూడా 'మీకు ఉచిత సీటు వచ్చింది' అని ఆన్‌లైన్‌లో చూపించి పథకాన్ని నిలిపివేస్తున్నారని తల్లులు కలెక్టర్ ముందు తమ ఆవేదనను వెళ్లగక్కారు. తల్లుల నుంచి భారీగా ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఈ ఫిర్యాదులను డీఈవో ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్షా అధికారులకు అందజేశారు. ఈ ఫిర్యాదుల పరిష్కారం కోసం డీఈవో కార్యాలయ సిబ్బంది, అధికారులు కలెక్టరేట్‌లోనే ల్యాప్‌టాప్‌లు పెట్టుకొని నిమగ్నమయ్యారు. ఒకవైపు తాము అన్ని విధాలుగా అర్హులమని, అయినా డబ్బులు రాలేదని తల్లులు ఆవేదన చెందుతుంటే, మరోవైపు ప్రభుత్వం కొత్త నిబంధనల పేరుతో సంక్షేమ పథకాలను కుదిస్తోందన్న విమర్శలు తీవ్రమవుతున్నాయి. 'తల్లికి వందనం' పథకంపై కొత్త నిబంధనలతో కూటమి సర్కారు తల్లుల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులే సమాధానం చెప్పాలి



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరూ ప్రభుత్వ పాఠశాల్లో చదువుకుంటున్నారు. 'తల్లికి వందనం' రాలేదు. పదే పదే సచివాలయం చుట్టు తిరుగుతున్నా... కలెక్టర్ కార్యాలయానికి ఇప్పటికి మూడో సారి వచ్చా...నా సమస్య పరిష్కారం కాలేదు. ఎవర్ని అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదు. అర్హత ఉండీ కూడా తల్లికి వందనం డబ్బులు ఎందుకు ఇవ్వలేదో అధికారులు సమాధానం చెప్పాలి.

– ఎస్.భాగ్యలక్ష్మి, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి మండలం

స్కూల్ గేమ్స్ సెక్రటరీల కోసం దరఖాస్తులు

ఆరిలోవ: జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ సెక్రటరీలుగా పనిచేయడానికి పాఠశాల సహాయకులు(పీడీ/పీఈటీలు) దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో ఎస్.ప్రేమకుమార్ తెలిపారు. 2025-26, 2026-27 విద్యా సంవత్సరాలకు అండర్-14, అండర్-17కు సంబంధించి స్కూల్ గేమ్స్ సెక్రటరీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి, జూలై 31, 2025 నాటికి పదేళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 20లోగా ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం sites.google.com/sites/deovizag వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

రెండు బస్సుల ఢీ

ఐదుగురు విద్యార్థులకు గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న పోలీసు

పెందుర్తి: విశాఖ-విజయనగరం జిల్లాల సరిహద్దులోని కొత్తవలస మండలం తాడివానిపాలెం వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు, ఒక కళాశాల బస్సు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు విద్యార్థినులకు స్వల్ప గాయాలయ్యాయి. తమ పరిధి కాకపోయినప్పటికీ, పెందుర్తి పోలీసులు తక్షణమే స్పందించి గాయపడినవారికి సహాయం అందించారు. కొత్తవలస నుంచి ప్రయాణికులతో ఐటీ హిల్స్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఎల్.కోటలోని బెహరా కళాశాలకు చెందిన బస్సు తాడివానిపాలెం కూడలి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కళాశాల బస్సులో ఉన్న ఐదుగురు విద్యార్థినులకు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పెందుర్తి సీఐ కేవీ సతీష్ కుమార్ స్పందించి సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించారు. గాయపడిన విద్యార్థినులను ఆటోలో గోపాలపట్నంలోని బెహరా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కొత్తవలస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుఃఖంలోనూ ఆదర్శం.. తల్లి నేత్రాల దానం


ఈశ్వరమ్మ (ఫైల్)

కంచరపాలెం: పుట్టెడు దుఃఖంలోనూ మానవత్వాన్ని చాటుకున్న ఘటన జీవీఎంసీ 47వ వార్డు, కంచరపాలెం, ఇందిరానగర్-5లో జరిగింది. తమ తల్లి మరణంతో తీవ్ర శోకంలో ఉన్నప్పటికీ ఆమె కళ్లను దానం చేసి ఆ కుటుంబం ఎంతోమందికి ఆదర్శంగా నిలిచింది. గండిబోయిన ఈశ్వరమ్మ (75) ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో కేజీహెచ్‌లో మృతి చెందారు. తల్లి మరణంతో ఆ కుటుంబం దుఃఖంలో మునిగిపోయింది. అయితే ఈశ్వరమ్మ భర్త అప్పారావు, కుమారులు అప్పలరాజు, సూర్యచంద్రరావు, కుమార్తె లక్ష్మి ఆమె కళ్లను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. వారి ఆదర్శ ఆలోచనతో మోషిని ఐ బ్యాంక్‌కు నేత్రదానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ టెక్నీషియన్ అజయ్ సహకారంతో కంటి రెటీనాను తొలగించి తరలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఒక వ్యక్తి దానం చేసే కళ్లతో నలుగురికి కూడా చూపునివ్వవచ్చని కంటి వైద్య నిపుణులు వివరించారు.

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్-1లో సోమవారం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్ట్ కార్మికుడు దుర్మరణం చెందాడు. విభాగంలో కాంట్రాక్ట్ పనులు చేస్తున్న కె.ఆర్.ఎల్ ఇంజనీరింగ్‌లో సురేష్ సింగ్ (26) అన్‌స్కిల్డ్ కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నాడు. విభాగంలో ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా టిపి బేలో ఉన్న టండిష్‌లో స్లాగ్ మెటీరియల్ పోస్తారు. అక్కడ స్లాగ్ మెటీరియల్ స్లాబ్‌గా తయారవుతుంది. ఈ ప్రక్రియలో ఆ స్లాబ్‌కు ఇరువైపులా హుక్‌లు ఏర్పాటు చేస్తారు. అక్కడ తయారైన స్లాబ్‌ను డంపర్‌లో లోడు చేస్తుండగా హుక్ జారీ అక్కడ విధులు నిర్వహిస్తున్న సురేష్ సింగ్‌పై పడింది. తీవ్ర గాయాలతో సురేష్‌సింగ్ అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. దీనిపై సీఐటీయూ నాయకులు కెఆర్ఎల్ యాజమాన్యంతో చర్చించగా నిబంధనల మేరకు వచ్చే వాటితో పాటు రెండు లక్షలు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉపాధి, దహన ఖర్చులు చెల్లించడానికి అంగీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.